ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

3★★


ఆదివారం 15 సెప్టెంబరు 2024

గల్ఫ్ బోర్డు, ఎన్‌ఆర్‌ఐ పాలసీపై ముందడుగు 5లో..

పల్లెల్లో అరకొర వైద్య సేవలు 5లో..

ఏకోపాధ్యాయ బోధన అస్తవ్యస్తం

- ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినా.. సమావేశానికి వెళ్లినా మూతే..
- విద్యార్థులున్నా... వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- బదిలీ అయినా...పాత చోటే కొందరు విధులు



జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాథమిక, ప్రాథమి కోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. బదిలీల్లో భాగంగా రిలీవ్ కాకుండా ఉండటం, ప్రస్తుత విద్యార్థుల సంఖ్యతో పాఠశాలలను క్రమబద్ధీకరణ చేయకపోవడం, పదోన్నతుల ప్రక్రియ అనంతరం సమస్య మరింత పెరిగి ప్రాథమిక విద్య అందని ద్రాక్షగా మారింది. పలు పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడు పనిచేస్తుండడం, మరికొన్ని పాఠశాలల్లో ఇటీవల ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ రిలీవ్ కాకుండా పాత స్థానంలోనే విధులు నిర్వహిస్తుండడం, ఇంకొన్ని పాఠశాలల్లో పోస్టులు మంజూరు కాకపోవడం తదితర సమస్యలు నెలకొన్నాయి.

బోధనకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలి

అంబటి భూమేశ్వర్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయుడు సెలవుల్లో వెళ్తే మరో పాఠశాలల నుంచి డిప్యుటేషన్‌పై పంపించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి. బోధనకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలి. మూతపడ్డ పాఠశాలలను సైతం తెరుచుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. బదిలీ అయినా ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి.

ఏకోపాధ్యాయ పాఠశాలల వల్ల నమ్మకం సన్నగిల్లింది

బైరం హరి కిరణ్, ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఏకోపాధ్యాయ పాఠశాలల వల్ల ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు నమ్మకం సన్నగిల్లింది. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి విధానాన్ని సవరించాలి. ఇటీవల బదిలీ అయినా ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి. అవ సరమైన పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలి. మూతపడ్డ పాఠశాలలను సైతం పునరుద్ధరించేలా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రయత్నాలు చేయాలి.

జిల్లాలో 120 ఏకోపాధ్యాయ పాఠశాలలు...

జిల్లా వ్యాప్తంగా 120 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నట్లు విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి. ఇందులో బీర్‌పూర్ మండలంలో 12 పాఠశాలలు, బుగ్గారంలో 1, బీమారంలో 5, ధర్మపురిలో 7, ఎండపల్లిలో 1, గొల్లపల్లిలో 6, ఇబ్రహీంపట్నంలో 4, జగిత్యాల అర్బన్‌లో 12, జగిత్యాల రూరల్‌లో 18, కథలాపూర్‌లో 10, కొడిమ్యాలలో 5, మల్లాపూర్‌లో 2, మల్యాలలో 5, మేడిపల్లిలో 4, మెట్‌పల్లిలో 4, పెగడపల్లిలో 5, రాయికల్‌లో 9, సారంగపూర్‌లో 8, వెల్గటూరులో 4 పాఠశాలల్లో ఒక్కొక్కరు చొప్పున ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

బదిలీ అయినా రిలీవ్ కాకుండా...

జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు బదిలీ అయినా పలువురు ఉపాధ్యాయులు రిలీవ్ కాకుండా పాత స్థానంలోనే విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 124 మంది ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ రిలీవ్ కాకుండా ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి. ఏళ్లుగా బదిలీల కోసం ఎదురు చూసిన కొంతమంది ఉపాధ్యాయులకు ఇంకా నిరాశే ఎదురవుతోంది. 2016 తర్వాత ప్రభుత్వం ఇటీవలే బదిలీల ప్రక్రియ చేపట్టింది. చాలా మంది ఉపాధ్యాయులు 10 నుంచి 11 ఏళ్లుగా మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి పలుమార్లు బదిలీలు చేప ట్టాలని విన్నవించగా, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు స్పందించింది. ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. బదిలీ అయిన పలువురిని రిలీవ్ చేయకపోవడంతో వారంతా పాత చోటే విధులు నిర్వహించాల్సి వస్తోంది. బదిలీ అయినా ఉపాధ్యాయుని స్థానంలో ఇతర ఉపాధ్యాయుడు వచ్చే వరకు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు రిలీవ్ చేయడం లేదని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి.

ఒకే చోట అయిదు తరగతులు...

జిల్లాలో పలు ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడే బోధన సాగిస్తున్నారు. వీరు అత్యవసరమై సెలవు పెట్టాల్సి వస్తే సమీప పాఠశాలల నుంచి మరొకరిని పంపాల్సి వస్తోంది. పోస్టుల భర్తీ కాక ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. కనీసం విద్యావలంటీర్ (వీవీ)లను నియమిస్తే సమస్య కొంత మేర తీరనుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పలు వాటిల్లో ఒకటవ తరగతి నుంచి అయిదవ తరగతి వరకు గల విద్యార్థులను ఒకే చోట కూర్చోబెట్టి బోధన చేయాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు.

తెరుచుకోని మూత పడ్డ పాఠశాలలు...

విద్యార్థులు లేకపోవడంతో జిల్లాలో పలు పాఠశాలలు (సున్న పాఠశాలలు) తాత్కాలికంగా మూతపడ్డాయి. వీటిలో పలు పాఠశాలల్లో టీచర్లు ఉన్నా విద్యార్థులు లేరు. ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఇతర స్కూళ్లకు సర్దుబాటు చేశారు. దీంతో సున్న పాఠశా లల భవనాలు కళా విహీనంగా మారాయి. కొన్ని చోట్ల ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లతో నిండి పోగా మరిన్ని పాఠశాలల భవనాలు అక్రమణాలకు గురైనట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి పాఠశాలలు మూత పడినా టీచర్లు మాత్రం కొనసాగుతూ వస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు పాఠశాలకు పిల్లలు వెళ్లి పోయినట్లు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో పాఠశాలలు మూతపడటం వల్ల విద్యార్థులు కిలో మీటర్లకు పైగా దూరం వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. దూరం, ఆర్థిక భారంగా మారుతోంది. కిలో మీటరు లోపు ప్రైమరీ, మూడు కిలో మీటర్ల లోపు అప్పర్ ప్రైమరీ, ఐదు కిలో మీటర్ల లోపు హై స్కూల్ ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. ఇందులో భాగంగా గతంలో పాఠశాలలు తెరిచి ఉపాధ్యాయులను కేటాయించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితుల వల్ల సర్కారు బడుల్లో పిల్లల సంఖ్య లేకపోవడంతో మూసివేశారు.



సీఎంను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే



సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్

జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిశారు. శనివారం హైద్రాబాద్‌లోని సీఎం కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా కేంద్రంగా జగిత్యాల ఏర్పడి పట్టణం శరవేగంగా విస్తరిస్తున్న సందర్భంగా అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా మరింత సహకారాలను అందించాలని కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మున్సిపల్ మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, మెట్ట బట్టి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్, సెప్టెంబరు 14: మూడు రోజులుగా రాయికల్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో విస్డమ్ హై స్కూల్‌కు చెందిన 15 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో పాలడుగు శ్రేష్ఠ (వాలీబాల్, కబడ్డీ), అండర్-17 విభాగంలో ఇల్లెందుల వరుణ్ (ఖోఖో), నోసిన మునీశ్వర్ సాయి (డిస్కస్ త్రో)లు ఎంపికయ్యారు. అలాగే అండర్-14 బాలికల విభాగంలో పెద్దిరెడ్డి నవ్యశ్రీ (కబడ్డీ), బోడ మిధున (ఖోఖో), మల్యాల మన స్విని (ఖోఖో), చందనగిరి మధు వర్షిణి (వాలీబాల్)లు ఎంపికయ్యారు. అండర్-14 బాలుర విభాగంలో కాసారపు మహీధర్ (వాలీబాల్), కొత్త అక్షిత్ (హైజంప్, వాలీబాల్), ఇద్దం ప్రద్యుమ్న (ఖోఖో), కండ్లపెల్లి శశాంక్ (ఖోఖో), వట్టిమల్ల వికాస్ (కబడ్డీ), కొత్త మణితేజ (లాంగ్‌జంప్)లు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, పీఈటీ జగన్, రవిష్ రెడ్డిలను ఎంఈవో గంగాధర్, కరస్పాండెంట్ ఎద్దండి ముత్యం పు రాజు రెడ్డి, డైరెక్టర్ నివేదిత రెడ్డి అభినందించారు.

ఘనంగా గోపాల కాలువలు

ధర్మపురి, సెప్టెంబరు 14: ధర్మపురి మండలంలోని తీగలధర్మారం గ్రామంలో గోపాల కాలువలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు కాకు స్తం లింబాద్రి స్వామి వారికి అభిషేకం, చందన ధారణము, 24 గంటలు ఏక నామస్మరణ, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల వివిధ రకాల వేషధారణ పలువురు భక్తులను ఆకట్టుకుంది. చివరగా గ్రామంలో ఉట్టి కొట్టే వేడుకలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం కూడ చేశారు. ఈ కార్యక్రమంలో తీగలధర్మారం మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్, అయిల్నేని ఆండాళు, గంధం గంగారాం, పందిరి తిరుపతి, వేముల రమాదేవి, అయిల్నేని విద్యాసాగర్‌రావు, ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

మెట్‌పల్లి, సెప్టెంబర్ 14(ఇబ్రహీంపట్నం) : ప్రభుత్వం నిర్వహించి స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీల్లో శనివారం మెట్‌పల్లి పట్టణానికి చెందిన శ్రీ చక్ర స్పేస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన ఎల్ జాహ్నవి వంద మీటర్ల పరుగులో మొదటి బహుమతి, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో రెండవ బహుమతి, జి సాయిచరణ్ జూనియర్ విభాగంలో 400 మీటర్ల రన్నింగ్‌లో మొదటి బహుమతి, సీనియర్ విభాగంలో ఐ మణిదీప్ లాంగ్‌జంప్‌లో మొదటి బహుమతి, 200 మీటర్ల రన్నింగ్‌లో రెండవ బహుమతి, జి రూపేష్ జాదవ్ 200 మీటర్ల రన్నింగ్‌లో మొదటి బహుమతి, లాంగ్ జంప్‌లో తృతీయ బహుమతి సాధించారు. విజేతలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌తో పాటు శ్రీ చక్రస్పేస్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

బీడీ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

మెట్‌పల్లిలో బీడీ కార్మికుల నిరసన



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీడి కార్మికులు

మెట్‌పల్లి, సెప్టెంబర్ 14(ఇబ్రహీంపట్నం) : తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు పట్టణంలోని పాత బస్టాండ్ నుండి ఆర్డీఓ కార్యలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు ఎన్ లక్ష్మీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్రం ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీడీ కార్మికులకు వెంటనే 4 వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు. పీఎఫ్‌కు కటాఫ్ డేట్ లేకుండ ప్రతి ఒక్క బీడీ కార్మికురాలికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విరమణ పొందిన కార్మికులకు 7 వేల పెన్షన్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని కోరారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టెందుకు కఠిన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు.

కాగ శనివారం ప్రభుత్వ సెలవు కావడంతో అధికారులకు వినతి పత్రం ఇవ్వాకుండనే వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

వైద్యబీమా సామాజిక భరోసాకు నాంది

సీనియర్ సిటిజన్స్ సంఘ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 14: 70ఏళ్లు పైబడిన వారందరికీ వైద్యం కోసం ప్రత్యేక బీమా కల్పిస్తామని కేంద్ర మంత్రిమండలి నిర్ణయించడం దేశంలో మరో సామాజిక భరోసాకు నాంది అని ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద, ధనిక తేడా లేకుండా అందరు సీనియర్ సిటిజన్‌లకు ఆర్థిక భద్రత, రక్షణ పై భరోసా కలుగుతుందన్నారు. పెన్షనర్‌లకు మాత్రం ప్రభుత్వం కల్పిస్తున్న ఆరోగ్యపథకం లేదా కేంద్రం ప్రకటించిన బీమా పథకంలో ఏదైనా ఒకదానినే వినియోగించుకనే అవకాశం ఉందని గమనించాలన్నారు. ప్రభుత్వం ఒక్కో కుటుంబంకు వైద్యం నిమిత్తం రూ. 10లక్షల వరకు ఖర్చు చేస్తుందన్నారు. సంఘ నాయకులు విశ్వనాథం, ప్రకాష్ రావు, విజయ్, హన్మంతరెడ్డి, యాకూబ్ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానానికి విరాళం

భీమారం, సెప్టెంబరు 14: వినాయక నవరాత్రోత్స వాలను పురస్కరించుకుని భీమారం మండల కేంద్రంలోని లయన్స్ యూత్ ఆధ్వర్యంలో అనాథాశ్రమంలో అన్నదానానికి విరాళం అందించాఆరు. ప్రతియేటా నిర్వహించే అన్నదానానికి భిన్నంగా జగిత్యాలలోని వాల్మీకి అనాథ ఆశ్రమంలో పిల్లలకు ఒకరోజు అన్నదానానికి అయ్యే ఖర్చును అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులను పలువురు అభినందిస్తున్నారు.

పాఠశాలలో ఆకట్టుకున్న ఓనం వేడుక



జ్యోతి హై స్కూల్‌లో నిర్వహించిన ఓనం వేడుకలు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 14: పట్టణంలోని స్థానిక జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీలో ఓనం వేడుకలు శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.

పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు మాట్లాడుతూ ఓనం ఆధునిక కాలంలో కూడా జరుపుకునే ప్రాచీన పండుగల్లో ఒకటిగా నిలవడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, మౌనికరావు, అజితరావు, కేరళ ఉపాధ్యాయులు మోలీబీజు, రాజేష్, అనురాజ్, మోబిన్‌తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

హిందీ భాషతోనే జాతీయ సమైక్యత

రాయికల్, సెప్టెంబరు 14: దేశంలోని అందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి జాతీయ సమైక్యతకు హిందీ భాష తోడ్పడిందని మండల నో డల్ అధికారి శ్రీపతి రాఘవులు అన్నారు. జాతీ య భాషా హిందీ దినోత్సవం సందర్భంగా రా యికల్‌లో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో శని వారం హిందీ ఉపాధ్యాయులు వసంతరావు, కూ రగాయల సురేష్, రాపర్తి నర్సయ్యను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేష్, మండల అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం, జిల్లా కార్యదర్శి దొంతి సతీష్, అసోసియేట్ అధ్యక్షుడు లక్కడి రాజరెడ్డి, కార్యదర్శి చెట్‌పెల్లి బాపురావు, సహ కార్యదర్శి సిలివేరి రమేష్, ఊషకోల రాము తదితరులు పాల్గొన్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

చొప్పదండి, సెప్టెంబరు 14: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, హోంగార్డు ఎల్లయ్య శుక్రవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా డయల్ 100కి ఒక వ్యక్తి ఫోన్ చేసి ముగ్గురు అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నారని ఫిర్యాదు చేశాడు. ఇద్దరు పోలీసులు గుమ్లాపూర్ వాహనంలో వెళ్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు పోలీసులకు ఎదురు కాగా గ్రామస్థులు తమను దొంగలు అనుకొని వెంటపడితే బైక్ వదిలిపెట్టి నడుచు కుంటూ వస్తున్నామని తెలిపారు. వారిద్దరిని వాహనంలో తీసుకొని గుమ్లాపూర్‌కి వెళ్లారు. అక్కడ మోటార్ సైకిల్ ఉండగా అదే సమయానికి అక్కడ కొందరు వ్యక్తులు పోలీసు లతో గొ డవకు దిగారు. అక్కడ ఉన్న కోలాపురి విజయ్ అనే వ్యక్తి పోలీసులతో దురుసుగా మా ట్లాడుతూ జీపులో ఉన్న వారిని మాకు అప్పగించాలని పోలీసులను నెట్టివేశాడు. గొడవ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడని హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోలపురి విజయ్ మీద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తేలుకాటుకు పారిశుధ్య కార్మికుడి దుర్మరణం

ఓదెల/యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 14: నిత్యం చెత్తకుప్పల మధ్య పని చేసే పారిశుధ్య కార్మికులకు గాయాలు కావడం మామూలే. అలా పని చేస్తున్న క్రమంలో తేలు కాటుకు గురై సాధారణ గాయంగా భావించి నిర్లక్ష్యం చేశాడా కార్మికుడు. విషం శరీరమంతా వ్యాపించిన తరవాత ఆస్పత్రికి వెళ్లినా ప్రయోజనం లేక పోయింది. నాలుగు రోజులు మృత్యువుతో పోరాడి చివరకు ప్రాణాలు కోల్పోయాడు. వివారాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లికి చెందిన నల్లూరి కళ్యాణ్ (26) రామగుండం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నాడు. 8ఇంక్లైన్ దగ్గరలో ఉన్న వెంకట్రావు పల్లి లో బుధవారం చెత్తను తొలగిస్తున్న క్రమంలో చేతికి గాయమైంది. చెత్తలో ఉన్న ఏదో వస్తువు తగిలిందని భావించి తన పని తాను చేసుకుంటూ పోయాడు. కొది సేపటికి అతని ఆరోగ్యం విషమించడంతో చెత్తలో ఉన్న తేలు కాటు వేసినట్లు తోటి కార్మికులు గుర్తించారు. గోదావరిఖని ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా విష ప్రభావం గుండె, మెదడు వంటి శరీర అవయవాలపై చూపుతోందని గుర్తించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి డాక్టర్ల సూచన మేరకు హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రెండు రోజులుగా వైద్య చికిత్సలు చేసినా పరిస్థితి అదుపులోకి రాలేదు. చివరకు శనివారం కల్యాణ్ మృతి చెందాడు. తేలు కాటును వెంటనే గుర్తించి సకాలంలో వైద్యం అంది ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని తోటి కార్మికులు వాపోతున్నారు. మృతునికి భార్య, కుమారుడున్నారు.



నల్లూరి కళ్యాణ్(ఫైల్)

19 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

శంకరపట్నం, సెప్టెంబరు 14: మండలంలోని మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు. తెల్లవారుజామున సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తూ వాహనాలు తనిఖీ చేయగా తాడికల్ గ్రామానికి చెందిన నరాల అంకూస్ ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 19క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. అంకూస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 14: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన గోడిశాల సదానందం అనే ఆర్ఎంపీ డాక్టర్ శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా చెల్పూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరోక ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో సదానందంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

వీణవంక, సెప్టెంబరు 14: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జీల పర్శరాములు ట్రాక్టర్‌లో మానేరు నుంచి జమ్మికుంటకు తరలిస్తుండగా కేసు నమోదు చేశారు.

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద బెజ్జంకి మండలం దేవక్కపల్లి నుంచి అను మతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

వీణవంక, సెప్టెంబరు 14: మండలంలోపెట్రోలింగ్ చేస్తుండగా శనివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ముగ్గురు వద్ద నుంచి 41,000 రూపాయల విలువ గల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమెదు చేసినట్లు పేర్కొన్నారు. కొర్కల్ లో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నా అంబరగొండ శ్రీనివాస్ నుంచి 7,530 రూపాయల విలువ గల మద్యం, చల్లూరులో గర్వందుల శివకృష్ణ నుంచి 32,260 రూపాయల విలువ ఉన్న, కొత్తపల్లిలో బొడిపల్లి కోటేశ్వర్ నుంచి 11,150 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

గల్ఫ్ బోర్డు, ఎన్‌ఆర్ఐ పాలసీపై ముందడుగు

- హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించిన మంత్రి పొన్నం- హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే, గల్ఫ్ ప్రభావిత ప్రాంతాల నేతలు



సమావేశం నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ బోర్డు ఏర్పాటు, ఎన్‌ఆర్ఐ పాలసీపై ప్రభుత్వం ముందడుగు వేసి పలు కసరత్తులు నిర్వహిస్తోంది. శనివారం హైద్రాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కన్వీనర్‌గా గల్ఫ్ కార్మికుల సంక్షేమం కొరకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు అందుబాటులో ఉన్న గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, నాయకులు, గల్ఫ్ వలసల నిపుణులు, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అభయ హస్తం ఎన్నికల మేనిఫెస్టోలో 'గల్ఫ్ కార్మికులు, ఎన్‌ఆర్ఐల సంక్షేమం' పేరుతో ఇచ్చిన నాలుగు హామీల అమలుకు అవసరమైన పలు కసరత్తులను సమావేశంలో నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వర్ధన్నపేట, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు నాగరాజు, భూపతిరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, సుంకెట అన్వేష్ రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రీహరి రావు, వెలిచాల రాజేందర్, వలస నిపుణులు అంబాసిడర్ వినోద్ కుమార్, గల్ఫ్ వలస కార్మిక నాయకులు మంద భీంరెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కథల్లో

మనిషి జీవించే హక్కులు

- కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని - 'కరీంనగర్ కథలు' సంకలనం ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 14 : సాహిత్యానికి పుట్టినిల్లుగా ఉన్న కరీంనగర్ ప్రాంతంలోని కవులు, రచయితుల రాసిన కథల్లో మనిషి జీవించే హక్కులు కనిపిస్తున్నాయని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ అచార్య సి.మృణాళిని అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్‌లో కరీంనగర్ కథల సంకలనం పరిచయసభ నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని, ప్రసిద్ధ కథా రచయిత అల్లం రాజయ్య, ప్రొఫెసర్ కాశీం, కథా సంకలనం సంపాదక వర్గం రచయితలు జూకంటి జగన్నాథం, డాక్టర్ నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్‌కుమార్, డాక్టర్ పత్తిపాక మోహన్, గరిపెల్లి అశోక్‌కుమార్, కరీంనగర్ కథల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచార్య మృణాళిని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో క్రీస్తుకు పూర్వం నుంచి ప్రజల భాషలో అనేక కథలు వచ్చాయన్నారు. ప్రజల భాషలో సాహిత్యం తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిందన్నారు. అనేక చారిత్రక పరిణామాలకు మనిషి జీవించే హక్కు కోసం తపించిన కథలు కరీంనగర్ కథల్లో కనిపిస్తు న్నాయన్నారు. కరీంనగర్ కథల్లో ప్రచురిం చిన ప్రతీ కథలు ప్రజల హక్కులను చూపిస్తున్నాయన్నారు. ఆ కథల్లో కవులు, రచయితలు రచించిన మాదిరిగానే ప్రజలు తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. ప్రముఖ రచయిత అల్లం రాజయ్య మాట్లాడుతూ శతాబ్దం యుద్ధ విషాదాలనుంచి ఇక్కడ సమాజం సంఘర్షణ పడుతూనే ఉందన్నారు. 90 సంవత్సరాల కథలను సంకలనంగా కరీంనగర్ కథలను తీసుకరావడం హర్షనీయమన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ కాళోజీ సంకలనంలో కథలు, సాహిత్యంలో వ్యాపార సంస్కృతి ప్రబలిపోతున్న కాలంలో నిశ్శబ్దంగా నిలబడ్డాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రంగినేని మోహన్‌రావు, రంగినేని నవీన్‌కుమార్, కవులు, రచయితలు బెజ్జారపు రవీందర్, బెజ్జారపు వినోద్‌కుమార్, అమర్, ఆడెపు లక్ష్మీపతి, రాజిరెడ్డి, దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, ఎల గోండ రవి, ఆడెపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో కరీంగనర్ కథల సంకలనాన్ని అవిష్కరిస్తున్న రచయితలు

ప్రాణం మీదికి తెచ్చిన రీల్స్ సరదా

- గూడ్స్ రైలెక్కి యువకుడి ఫొటోలు

- విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలు

కాజీపేట, సెప్టెంబరు 14: రీల్స్ సరదా పిచ్చి ముదురుతోంది. ఈ సరదాలో పడి ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. కాజీపేటలో ఓ యువకుడు గూడ్స్ రైలు బోగి ఎక్కి రీల్స్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన రాజు అనే యువకుడు శనివారం కడిపికొండలో ఓ చర్చిలో జరుగుతున్న కార్యక్రమానికి హాజరయ్యాడు. కార్యక్రమం జరుగుతుండగా సమీపంలోని రాంనగర్‌లో నిలిపి ఉన్న రైలు బోగీ ఎక్కి సెల్‌ఫోన్‌లో రీల్స్ చేస్తున్నాడు. ఈ క్రమంలో రైలుపై ఉన్న హైటెన్షన్ కరెంట్ తీగలు రాజును లాగిపడేశాయి. దీంతో కరెంట్ షాక్‌కు గురైన రాజు తీవ్రగాయాలతో బోగీ నుంచి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు.. 108కు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన 108 మెడికల్ టెక్నీషియన్ లింగాల శివకుమార్, పైలట్ కుంట రవిలు ఘటనాస్థలికి చేరుకుని ఎమర్జెన్సీ చికిత్స చేసి ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనలో రాజు 70 శాతం శరీరం కాలిపోయిందని ఎంజీఎం వైద్యులు తెలిపారు. స్పృహ కోల్పోయిన రాజు కుటుంబ వివరాలు తెలియాల్సి వుంది.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

గొల్లపల్లి, సెప్టెంబరు 14: దీర్ఘకాలంగా రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయాల్లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ధర్మారం మండల కేంద్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సెక్యూరిటీ గార్డులు శనివారం వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీలలో 1994 సంవత్సరం నుంచి ఇప్పటివరు సెక్యూరిటీ గార్డులుగా 1200 మంది నియమితులై దాదాపు 27 సంవత్సరాలుగా మార్కెట్ కమిటీకి సేవలు చేస్తున్నామని, ఏజెన్సీ విధానం రద్దు చేస్తూ తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. మార్కెట్ కమిటీ నిధుల నుంచి జీతభత్యాలు చెల్లిస్తున్నందున సర్వీస్ రెగ్యులర్ చేయడం వలన ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి భారం పడదని, అనుబంధంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులందరి సర్వీస్‌ను రెగ్యులర్ చేశారని, వారిలాగే తమ సర్వీస్‌ను కూడా రెగ్యులర్ చేసి మా బతుకుల్లో వెలుగులు నింపి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ సలీం, బొల్లం మల్లేశం, ముంజ సతీష్ గౌడ్, కిషన్ రావు, జూపాక కుమార స్వామి, జనార్దన్, హైమద్ చందు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



నృసింహుడిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 14: ధర్మపురి క్షేత్రంలో భాద్రపద మాసం ఏకాదశి శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిట లాడాయి. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజా టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీని వాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

● లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ కుటుంబ సమేతంగా సందర్శించారు. వేద పండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆల య ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు.

తుమ్మేటి సమ్మిరెడ్డి ఆకస్మిక మృతి

- అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

జమ్మికుంట, సెప్టెంబరు 14: జమ్మికుంటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి (59) గుండెపోటుతో శుక్రవారం అర్ధరాత్రి ఆకస్మాత్తుగా మృతి చెందారు. గుండెపోటుకు గురైన సమ్మిరెడ్డిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి నాయకుడి నుంచి ఎదిగి రెండు పర్యాయాలు జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. కాగా తుమ్మేటి సమ్మిరెడ్డి మరణ వార్త విన్న మంత్రి పొన్నం ప్రభాకర్ తన కార్యక్రమాలను వాయిదా వేసుకోని హైదరాబాద్ నుంచి హుటాహుటిన జమ్మికుంటకు వచ్చారు. సమ్మిరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమ్మిరెడ్డి కుమారుడిని పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఫోన్‌లో సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు, యుప్‌టీవి సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, ప్రజా ప్రతినిధులు, ప్రముఖ రాజకీయ నాయకులు, కార్యకర్తలు బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తుమ్మేటి సమ్మిరెడ్డి (ఫైల్) (ఇన్‌సెట్‌లో)

సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పునరుద్ధరించండి

గిత్యాల అర్బన్, సెప్టెంబరు 14: జగిత్యాల నియోజకవర్గంలోని బీర్‌పూర్ మండలంలో ఉమ్మడి రాష్ట్రంలో నెలకొల్పబడిన సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004-2009 సంవత్సరానికి సంబంధించి మండలంలో ప్యూరిఫైడ్ వాటర్ సరఫరా నిమిత్తం ఈ స్కీం ఏర్పాటు చేయబడిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ తాగునీటి సరఫరాకు సంబంధించి మిషన్ భగీరథ పథకాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా శుద్ధనీటిని సరఫరా చేస్తామని ప్రకటించి సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పక్కనపెట్టారన్నారు. అటు భగీరథ నీరుఅందక, ఇటు సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్లక్ష్యానికి గురికావడంతో మండల ప్రజలు తాగునీటికోసం వాటర్ ప్లాంట్‌ల వద్ద కొనుగోలు చేసుకుని తాగే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాయికల్, జగిత్యాల మండలాల్లో రాపిడ్ స్టాండ్ ఫిల్టర్ నీటి శుద్ధి కేంద్రాల మాదిరిగానే ఇప్పుడున్న 2ఎంఎల్‌డీ ఎస్‌ఎస్‌ఎఫ్ స్థానంలో 5ఎంఎల్‌డీ ఆర్‌ఎస్‌ఎఫ్ నీటి శుద్ధి కేంద్రం నిర్మించి, బీర్‌పూర్ మండలంలోని 34 గ్రామాలకు తాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. కావున బీర్‌పూర్ మండలంలోని సీపీడబ్ల్యూఎస్ పథకాల పునరుద్ధరణకు సంబంధించి రూ.800లక్షలతో అంచనాలు రూపొందించామని, గ్రామీణ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రివైజ్డ్ అంచనాలకు అనుగుణంగా సంబంధిత అంచనా నిధులు మంజూరు చేయాలని కోరారు.

గురుకుల ఉపాధ్యాయుల పనివేళలు మార్చాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 14: గురుకుల ఉపాధ్యాయుల పని వేళలను మార్చాలని యూటీఎఫ్ ఎంజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లివిన్‌స్టన్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలు, కళాశాలలను సందర్శించి యూటీఎఫ్ సభ్యత్వ నమోదు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల ప్రిన్సిపాల్స్, జేఎల్స్, డిగ్రీ లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని, హెల్త్‌కార్డులు మంజూరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్ట్స్, క్రాఫ్ట్, మ్యూజిక్, లైబ్రేరియన్స్, స్టాఫ్‌నర్స్ ప్రమోషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కుమార్, జావేద్, సభ్యులు సురేశ్‌కుమార్, జాన్సన్, హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సెక్యూరిటీ గార్డ్‌పై లైంగిక వేధింపులు

- షీ టీమ్‌కు సమాచారం ఇచ్చిన బాధితురాలు- రెండు నెలల్లో రెండో ఘటన



రామగుండం మెడికల్ కళాశాల ముఖద్వారం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 14: సింగరేణి ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్)లో మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపుల ఘటన మరొకటి వెలుగు చూసింది. సిమ్స్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న మహిళపై సెక్యూరిటీ సూపర్‌వైజర్ గాదె సుధాకర్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అతని వేధింపులు భరించలేక బాధితురాలు షీ టీమ్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో షీటీమ్ బాధితురాలి నుంచి వివరాలు సేకరించింది. ఘటనపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధితురాలు మెడికల్ కళాశాలలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తోంది. సుధాకర్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. నిత్యం నానా రకాలుగా బాధితురాలిని లైంగికంగా వేధిస్తుండడంతో ఆమె ప్రిన్సిపాల్ దృష్టికి కూడా తీసుకెళ్లింది. ప్రవర్తన మారకపోవడంతో షీటీమ్‌ను ఆశ్రయించింది. జూలైలో ఇదే కళాశాలలో ఒక సూపర్‌వైజర్ పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికురాలిని లైంగికంగా వేధించిన ఘటన చోటు చేసుకుంది. అతన్ని విధుల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు. రెండు నెలల్లోనే సిమ్స్‌లో రెండో ఘటన వెలుగుచూడడం గమనార్హం. గోదావరిఖని సింగరేణి మెడికల్ కళాశాలలో సెక్యూరిటీ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీగా ఉన్న సంస్థ నిర్వహణ విషయంలో మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తుందనే ఆరో పణలు ఉన్నాయి. పని స్థలాల్లో మహిళా కార్మికులకు రక్ష ణ, వేధింపులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సంబంధిత ఏజెన్సీదే. ఒక ఘటన జరిగిన తరువాతనైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇవేమి చేపట్టకుండా నిర్వహణను గాలికి వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి.

పరస్పరదాడులు .. కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 14: పట్టణంలోని జిల్లా ఆసుపత్రి సమీపంలో వస్త్రదుకాణం ఎదుట వాహనం పార్కింగ్ ఘర్షణకు దారితీసింది. శుక్రవారం పట్టణంలో వస్త్ర దుకాణం ఎదుట కైలాస్ అనే వ్యక్తి కారు పార్క్ చేశాడు. దుకాణం ఎదుట కారు పార్క్ చేయడంతో తొలగించాలని వ్యాపారి శ్రీనివాస్ సూచించాడు. ఎందుకు తీయాలంటూ ప్రశ్నించడంతో పరస్ప రదాడులకు దారితీసింది. పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు వారు ఫిర్యాదు చేశారు. కారు యజమాని కైలాస్‌పై, వస్త్రదుకాణం యజమాని శ్రీనివాస్, అతడి కుమారుడిపై శనివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

విష జ్వరంతో విద్యార్థిని మృతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 14: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మైదంశెట్టి నక్షత్రహాసిని (14) అనే విద్యార్థిని విష జ్వరంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నక్షత్ర హాసిని స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. మూడు రోజుల కిందట జ్వరం బారిన పడడంతో విద్యార్థినికి మండల కేంద్రంలోని పీఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం చనిపోయింది. నక్షత్రహాసిని తండ్రి ఉద్యోగ రీత్యా ఎల్లారెడ్డి పేటలో ఉంటున్నప్పటికీ వారి స్వగ్రామం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం కావడంతో మృతదేహాన్ని అక్కడికి తరలించారు.



నక్షత్రహాసిని(ఫైల్)

కుక్కల స్వైర విహారం

- దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు

- గ్రామస్థుల భయాందోళన

మంథని, సెప్టెంబరు 14: గ్రామాల్లో వీధి కుక్కలు రెచ్చిపోయి జనం మీద పడి విచ్చలవిడిగా దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. మండలంలోని స్వర్ణపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో శనివారం కుక్క స్వైర విహారం చేస్తూ దాడులు చేయడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్వర్ణపల్లి గ్రామంలో తమ ఇంటి ముం దు ఆడుకుంటున్న నలుబోతుల మానసశ్రీ, కొరవేన వేదాన్స్‌పటేల్ పై, మరో వ్యక్తిపై కుక్కలు విచ్చక్షణరహితంగా దాడి చేశాయి. దీంతో చిన్నారులిద్దరికి పలు చోట్ల తీవ్రంగా గాయాలయ్యాయి. తీవ్ర గాయాలు, రక్తస్రావం అధికం కావడంతో చిన్నారుల, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గాయపడ్డ చిన్నారులను చికిత్స కోసం కుటుంబ సభ్యులు మంథనికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గడ్డం మల్లేష్‌తోపాటు అతడి కూతురు శ్రావ్యపై ఇదే కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. తొలుత స్వర్ణపల్లి గ్రామంలో పలువురిపై దాడి చేసిన కుక్కను గ్రామస్థులు తరిమివేశారు. పక్కనే ఉన్న వెంకటాపూర్‌కు చేరుకొని తండ్రి కూతురు పై దాడి చేసింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు పిచ్చకుక్కను చంపి వేశారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను పుట్ట మధు కోరారు. ఇటీవల గ్రామాల్లో యథేచ్ఛగా సంచరిస్తున్న వీధి కుక్కలు చిన్నారులు, అందరి పై దాడులు చేస్తుండటంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కల దాడుల నుంచి రక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కరీంనగర్‌లో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు (ఇన్‌సెట్‌లో గాయపడ్డ చిన్నారి)

పల్లెల్లో అరకొర వైద్య సేవలు

- » సెలవుల్లో వైద్యాధికారి
- » పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత
- » సగానికి పైగా గ్రామాల్లో మొదటి ఏఎన్‌ఎంలు లైని వైనం
- » సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు

మల్యాల, సెప్టెంబరు 14: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యశాఖ పేర్కొంటున్నప్పటికీ వైద్యులు, వైద్య సిబ్బంది కొరతతో గ్రామాల్లో ప్రజలకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో పాటు డెంగ్యూ, చికున్‌గున్యా జ్వరాలతో మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాల్సి ఉండగా సగం గ్రామాల్లో ఏఎన్‌ఎంల కొరత నెలకొంది. దానికి తోడు పల్లె దవాఖానాలో వైద్యులు లేకపోగా మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, మండల వైద్యాధికారి సెలవులో వెళ్లారు. దీంతో గ్రామాల్లో వైద్య సేవల పర్యవేక్షణ అంతంత మాత్రమే సాగుతున్నట్లు తెలుస్తుంది. నెల రోజులుగా గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతుండగా మల్యాలలోని పీహెచ్‌సీకి నిత్యం వందకు పైగా రోగులు వస్తున్నారు. ఈ క్రమంలో వైద్యుల కొరత వైద్య సేవలకు అంతరాయంగా మారుతోంది. దీంతో గ్రామాల్లోని ప్రజలు జగిత్యాల లాంటి పట్టణాలకు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెలుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి

అంతరాయం లేకుండా వైద్య సేవలు

వైద్యురాలు సెలవులో ఉన్నప్పటికీ పల్లె దవాఖాన వైద్యులతో రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించడం జరుగుతుంది. గ్రామాల్లో ఇద్దరేసి ఏఎన్‌ఎంలు ఉంటుండగా ఖాళీలు ఉన్న చోట్ల ఒకరు విధుల్లో ఉంటున్నారు. వైద్యుల కొరత దృష్ట్యా పల్లె దవాఖానాల్లో ఖాళీలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రత్యామ్నయంగా వైద్య సేవలు కొనసాగుతున్నాయి.

- సమీయొద్దీన్, డీఎంహెచ్‌వో

● వైద్యులు లేని పల్లె దవాఖాలు

గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలను మరింత అందుబాటులోకి తేవడంతో పాటు పెద్ద ఆసుపత్రి సేవలను అందించడానికి ఏర్పాటు చేసిన పల్లె దావాఖాల్లో వైద్యుల కొరత నెలకొంది. మండలంలో పోతారం, రాంపూర్, మ్యాడంపల్లి, తక్కళ్లపల్లి, నూకపల్లి గ్రామాల్లో పల్లెదవాఖానాలు ఉండగా తక్కళ్లపల్లి, నూకపల్లిలో వైద్యులు లేరు. ఉన్న ముగ్గురు పల్లె దవాఖాన వైద్యులే మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు.తక్కళ్లపల్లిలో స్టాఫ్ నర్స్ ఆధ్వర్యంలో పల్లె దవాఖాన కొనసాగుతుంది. ఇక ఇంటింటికి అందుబాటులో ఉంటూ నిత్యం వైద్య సేవలు అందించే స్టాఫ్ నర్సులు మండల వ్యాప్తంగా 8మంది ఉండగా రాంపూర్, తాటిపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి గ్రామాల్లో లేరు. దీంతో రెండవ ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. మండల వైద్యాధికారి మౌనిఖ సెలవులో ఉండగా ప్రాథమిక ఆసుపత్రి పరిధిలో ఒక్క ఆరోగ్య పర్యవేక్షణ అధికారి పోస్టు కూడా ఖాళీ ఉంది. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండగట్టులో అంజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే శాలువ



అగ్గిపెట్టెలో పట్టి శాలువ అందజేస్తున్న విజయ్

మల్యాల, సెప్టెంబరు 14: సిరిసిల్లాకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ కొండగట్టు ఆంజనేయస్వా మికి అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు శాలువను అందజేశాడు. శనివారం కుటుంబసమేతంగా అంజన్న సన్నిధికి వచ్చిన విజయ్‌కుమార్ స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ అధికారులకు పట్టు శాలువను అందజేశారు. ఈ సం దర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, దర్మేంధర్ తదితరులు ఉన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎస్సారెస్పీ లోకి 27,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 27,315 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

సభ్యత్వ నమోదు లక్ష్యాలను పూర్తి చేయాలి

● నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి వికాస్‌రావు



కథలాపూర్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్న వికాస్‌రావు

కథలాపూర్, సెప్టెంబరు 14 : ప్రతీ బూత్‌కు నిర్దేశించిన సభ్యత్వ నమోదు లక్ష్యాలను నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వికాస్‌రావు సూచించారు. శనివారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. కొద్ది రోజుల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సభ్యత్వాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సభ్యత్వాలను వేగవంతం చేయాలని కోరారు. అనంతరం దుంపెటలో వినాయక మండపాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, సత్యం, ఆనందరెడ్డి, మహేశ్, ప్రతాప్, కిషోర్, అనిల్ ఉన్నారు.

పోరాటాల స్ఫూర్తితో ఉద్యమించాలి

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు



కోరుట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కోరుట్ల, సెప్టెంబరు 14 : తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా ఉందని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు పేర్కొన్నారు. పట్టణంలోని కామ్రేడ్ చిలువేరి ప్రభాకర్ భవన్‌లో 76వ సాయుధ పోరాటాల ఉత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. పోరాటాల స్ఫూర్తి వల్ల 500 మంది అమరులయ్యారని 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ చేశామన్నారు. సాయుధ పోరాటాల ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం రాష్ట్ర భారత యూనియన్‌లో విలీనమైందని అన్నారు. ఈ పోరాటాలు చేసి అమరులైన దొడ్డి కొంరయ్య, రావి నారాయణరెడ్డి, చాకలి ఐలమ్మ, భీమ్‌రెడ్డి, ధర్మాభిక్షం, అనభేరి ప్రభాకర్‌రావులను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ నేతలు చెన్న విశ్వనాథం, మౌలానా, రాంబాబు, ఎన్నం రాధ ఉన్నారు.

అడవులను ధ్వంసం చేస్తే క్రిమినల్ కేసులు

కథలాపూర్, సెప్టెంబరు 14 : అటవీ భూములను ధ్వంసం చేసి పోడు వ్యవసాయం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మెట్‌పల్లి ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో పద్మారావు హెచ్చరించారు. మండలంలోని ఇప్పపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఇప్పపల్లి, పోతారం గ్రామాల మధ్య కొందరు అటవీ భూములను ధ్వంసం చేస్తున్నట్టు సమాచారం రావడంతో మొబైల్ పార్టీ సిబ్బందితో అక్కడికి చేరుకుని మాట్లాడారు ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో అడవులను నరికి వేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. కాగా రెవెన్యూ, అటవీ హద్దులు నిర్ణయించాలని గ్రామస్థులు అటవీ అధికారులకు చెప్పారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మొబైల్ పార్టీ డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాస్, సెక్షన్ అధికారి తీగల మల్లేశంగౌడ్, బీట్ అధికారులు ప్రవీణ్, శివతేజ ఉన్నారు.

చెగ్యాం నిర్వాసితులకు పరిహారం అందజేత



చెగ్యాం నిర్వాసితులకు పరిహారం చెక్కు అందిస్తున్న బట్టి విక్రమార్క

వెల్గటూర్, సెప్టెంబరు 14: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో ఇల్లు భూములు కోల్పోయిన నిర్వాసితులకు మిగిలిపోయిన ముంపు పరిహారాన్ని శనివారం ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నిర్వాసితులకు అందజేశారు. ధర్మారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో చెగ్యాంలోని 125 కుటుంబాలకు రూ. 18 కోట్ల పరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవతో దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న పరిహారం మంజూరుకు మోక్షం కలిగిందన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ మధ్యనే ముక్కట్రావుపేట నిర్వాసితులకు మిగులు పరిహారం అందజేశామని, చెగ్యాం నిర్వాసితులకు 18 కోట్ల రూపాయల పరిహారం అందజేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు, మంత్రి శ్రీధర్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శేఖర్, మండల నాయకులు పాల్గొన్నారు

ముగిసిన ఎస్‌జీఎఫ్ పోటీలు



విజేతలకు మెడల్స్ అందజేసిన నాయకులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 12 : మండలంలోని వెల్లుల్ల ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలు శనివారం విజయవంతంగా ముగిసాయి. మండలం పరిధిలోని 24 పాఠశాలలోని అండర్-14, 17కు చెందని సుమారు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. స్టార్ ఈఎన్‌టీ ఆసపత్రి వారు సమకూర్చగా మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డితో పాటు పలువురు నాయకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఎల్ఎస్‌సీఎస్ మాజీ ఛైర్మన్ మారు మురళీధర్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్యంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రవీందర్, పీఈటీలు కొమరయ్య, కార్తీక్, జ్ఞానేశ్వర్, ప్రశాంత్, వంశీ, నవీన్, కుంట శ్రీకాంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రోత్సవాలు



కోరుట్ల, సెప్టెంబరు 14: గణపతి నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కోరుట్ల పట్టణంలోని శ్రీరామాంజనేయ ఆలయంతో పాటు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వినాయకుని సన్నిధిలో కుంకుమ పూజలు చేశారు. అఖండ భజన, గోపాల కాలువలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వెంకలక్ష్మీ, శిరీష, లావణ్య, సుధా కర్‌రెడ్డి ఉన్నారు.

కథలాపూర్ : మండలంలోని సిరికొండలో యువతరం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని సన్నిధానంలో ఘనంగా పూజలు నిర్వహించారు. భూషణరావుపేటలో అభ్యుదయ యూత్ అన్నదానం ఏర్పాటు చేసింది. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం) : పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను మండప నిర్వహకులు, యువజన సంఘల నాయకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పలు వినాయక మండపాల వద్ద కుంకుమ పూజలు, సమూహిక సరస్వతి పూజలు నిర్వహించారు.

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని పలు వీధుల్లో నెలకొల్పిన వినాయక మండపాల్లో గణనాథుడు శనివారం పూజలు అందుకున్నారు. ఆర్యవైశ్య వినాయక మండపంలో వివిధ రకాల కూరగాయలతో గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. పలు మండపాల వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్యవైశ్య, వర్తక సంఘాల మండల, పట్టణ శాఖల అధ్యక్షులు సంతోష్‌కుమార్, పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలూరులో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో మున్నూరుకాపు సంఘ భవనం ఆవరణలో అన్నదానం నిర్వహించారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని రామకిష్టాపూర్ రోడ్డు సమీపంలో వందేమాతరం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో శనివానం కుంకుమ పూజనుపూజారి రాధా కృష్ణశర్మ ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు బైరి వెంకటి, శ్రీనివాస్, రాకేష్, ఆదిరెడ్డి, వందేమా తరం ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో విషజ్వరాలు తగ్గాలని భరత్‌నగర్ యువసేన ఆధ్వర్యంలో వినాయక మండపంలో హోమం తదితర పూజ కార్యక్రమానలు చేపట్టారు. శనివారం వినాయక మండపంలో నిర్వాహకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు తదితర కార్యక్రమాలను చేశారు. అనంతరం మండపంలో భక్తులచే హోమం, మహిళలచే కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యూతు అధ్యక్షుడు అన్నారపు గంగాధర్, ఉపాధ్యక్షుడు ఏశాల సతీష్, కోశాధికారి మాదరవెన రాకేష్, సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల ఫోకస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద శనివారం కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మల్యాల: నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో వినాయక మంటపాల వద్ద దీపాలంకరణ, 108 నైవేద్యాలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. మల్యాల బీసీ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకునికి వద్ద మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నాయకులు జనగాం శ్రీనివాస్, సాగర్‌రావు, దశరథం, శ్రీనివాస్, రంజిత్, చిన్నదుర్గయ్య, రాజేందర్ పూజలు నిర్వహించారు

గొల్లపల్లి: గొల్లపల్లి మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా 7వ రోజు భక్తులచే గణనాథుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. మహిళలకు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

మల్లాపూర్: గణపతి నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వినాయకుడి మండపాలలో భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం మండలంలోని వేంపల్లి గ్రామంలోని గణేష్ మండపంలో కుంకుమ పూజలను మహిళలు చేపట్టారు. నిర్వహకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు తదితర కార్యక్రమాలను చేశారు. పలు గ్రామాల్లోని మండపాల వద్ద అన్నప్రసాదం వితరణ చేపట్టారు. రాత్రి వినాయక భజనలు చేపట్టారు.



మెట్‌పల్లి బాలకిషన్ నగర్‌లో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



కోరుట్లలో కుంకుమ పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు



కథలాపూర్ మండలం సిరికొండలో కుంకుమ పూజల్లో మహిళలు









రాయికల్‌లో, కొడిమ్యాల,మల్లాపూర్‌లలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు, గొల్లపల్లిలో భక్తుల పూజలు

నిమజ్జనం రోజున అల్లర్లు సృష్టిస్తే రౌడీషీట్లు తెరుస్తాం

● ముందస్తుంగా 175 మంది బైండోవర్

● మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి, సెప్టెంబర్ 14(ఇబ్రహీంపట్నం) : వినాయక నిమజ్జనం సందర్భంగా ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 16,17న నిర్వహించే వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రౌడీ షీటర్లు, ఆటంకం కలిగించే వారితో పాటు డీజే నిర్వాహకులను మెట్‌పల్లిలో 96 మంది, ఇబ్రహీంపట్నంలో 37 మంది, మల్లా పూర్‌లో 42 మంది మొత్తం సర్కిల్ పరిధిలో 175 మందిని ముందస్తుగా తహసీల్దార్‌ల ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు. భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జన వేడుకలను జరుపుకోవాలని కోరారు. డీజే నిర్వాహకులు ఎవరు బాక్స్‌లు ఇచ్చిన వాటిని సీజ్ చేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

పట్టణంలో భారీ బందోబస్తు

వినాయక నిమజ్జనం సందర్భంగా పట్టణంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 100 సీసీ కెమెరాలను అమర్చి అడుగడుగునా నిఘా నేత్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 150 మంది పోలీసులు, 50 మంది స్పెషల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయం నుంచి వట్టివాగు వరకు వన్‌వే ఉంటుందని తెలిపారు. నిమజ్జనం వద్ద ఇరువైపుల భారీకేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డుకు ఇరువైపుల షాపులు మూసివేయాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని ఆయన కోరారు.

'దేశ అభివృద్ధి కోసం బీజేపీని బలోపేతం చేద్దాం'

వేములవాడ, సెప్టెంబర్ 14 : దేశ అభివృద్ధి కోసం బీజేపీని మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం వేములవాడ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేష్ తదితరులకు బీజేపీ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీ అని, దేశ ప్రజల మద్దతుతో ఇప్పటికి మూడు పర్యాయాలు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని అన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు హనుమండ్లు, అక్కపెల్లి వివేక్ రెడ్డి, వేములవాడ రూరల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు మల్లేశం, మనోజ్, రాజ్ కుమార్, మైలారం శ్రీనివాస్, బాలరాజు, లక్ష్మన్, నామాల శేఖర్, మామిండ్ల లక్ష్మీరాజం, రంజిత్ రెడ్డి, రేగుల శ్రీకాంత్, కృష్ణ, అన్నం నర్సయ్య పాల్గొన్నారు.

పర్యావరణహిత కళాకారుడికి సన్మానం

రాయికల్, సెప్టెంబరు 14: మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన ఊరె నర్సయ్య పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో వెదురు బొంగులతో వినాయక ప్రతిమను తయారు చేశాడు. ఈ సందర్భంగా నర్సయ్యను గ్రామానికి చెందిన కొమ్ము దిలీప్, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావులు ఘనంగా సన్మానించారు. భూపతిపూర్ గ్రామానికి చెందిన ఆదర్శ యూత్ అధ్యక్షుడు కామని రాజు మట్టి వినాయక విగ్ర హాన్ని ప్రతిష్ఠించారు. మట్టి వినాయకుడి వల్ల పర్యావరణానికి ఎలాంటి ఆపద ఉండదని, మిగతా యూత్ వారు ఆదర్శ యూత్ వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు రాజును ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, ఏలేటి రమేష్ రెడ్డి, తీగల తిరుపతి రెడ్డి, మహేష్, సంకోజి, యుగంధర్ రెడ్డి, రమేష్, గంగాధర్, తిరుపతి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి సీఎం కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న వెల్గటూర్ పాలకవర్గ సభ్యులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏఎంసీ పాలకవర్గం

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

వెల్గటూర్, సెప్టెంబరు 14 : రైతుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు. శనివారం ధర్మారం మార్కెట్ యార్డులో వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా గుండాటి దీపిక జితేందర్‌రెడ్డి చేత, నూతన పాలకవర్గం చేత ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో వరంగల్ ప్రాంతీయ సంచాలకులు పద్మావతి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విక్రమార్క మాట్లాడుతూ నూతన పాలకవర్గం రైతులకు చేదోడువాదోడుగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వైస్ ఛైర్మన్‌గా ముత్తునూర్‌కు చెందిన గోల్ల తిరుపతి, సభ్యులుగా ద్యావ మహిపాల్‌రెడ్డి, చెల్పూరి చంద్రమౌళి, బీసవేని హరీష్, సింగతి శ్రీనివాస్, సప్ప లింగయ్య, దూడ రవి, కడారి సత్తయ్య, జూపాక ప్రవీణ్, మాచర్ల సంజీవ్, పోలోజు శ్రీనివాస్, పొరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాత రాజేశంలు ప్రమాణ స్వీకారం చేశారు.

ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

గొల్లపల్లి: ఇటీవల నియామకమైన గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంత్రుల సమక్షంలో గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంచే మార్కెట్ కార్యదర్శి ఫైజొద్దీన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అనంతరం పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ ఛైర్మన్ సంతోష్, వైస్ ఛైర్మన్ రాజరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ శాఖల అధ్యక్షులు నిశాంత్‌రెడ్డి, మహేష్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు లంబ ధనవ్వలక్ష్మణ్, గంగాధర్, సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్, అనిల్‌కుమార్, తిరుపతి, రంగు శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కొడిమ్యాల : బదిలీపై కరీంనగర్‌కు వెలుతున్న మండల కేంద్రంలోని సబ్ పోస్ట్ మాస్టర్ మహేష్‌ను సిబ్బంది శాలువా కప్పి శనివారం సన్మానించారు. సిబ్బంది బైరి సత్తయ్య, నితిన్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని వెన్గుమట్ల గ్రామంలో శనివారం గొర్రెలు, మేకలకు ఇన్‌ఛార్జి పశు వైద్యాధికారి కొమ్మెర మనీషా పటేల్ పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. పీపీఆర్ టీ కాలు 4 నెలలు పైబడిన గొర్రెలు, మేకలకు వేయించా లన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ సంధ్య, సిబ్బంది, గొర్రె కాపరి రాజయ్య పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని బాలపల్లి గ్రామంలో శనివారం గొర్రెల, మేకల సర్వే నిర్వహించారు. పశువైద్యాధికారుల ఆదేశాల మేరకు భారత పశుధాన్ యాప్ ద్వారా వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి కందుకూరి పూర్ణచందర్ యాప్ ద్వారా గొర్రెల, మేకల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్ లో నమోదు చేశారు. గ్రామంలో మొత్తం 16 మంది యాదవ రైతులకు 2084 గొర్రెలు, 324 మేకలు ఉన్నట్లు సర్వే ద్వారా గుర్తించారు. ఈకార్యక్రమంలో యాదవరైతులు, పాడిరైతులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీకళాశాలలో భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం సబ్జెక్టులు బోధించేందుకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గునుక శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మహిళ అభ్యర్థులు ఈనెల 17వ తేదీ లోపు 10 గంటలకు నేరుగా కళాశాలలో వచ్చి డెమోకు హాజ రుకావాలని తెలిపారు.

జగిత్యాలరూరల్: మహిళల రక్షణ కోసం షీ టీమ్ పనిచేస్తుందని షీటీమ్ ఏఎస్సై వలీబేగ్ అన్నారు. శనివారం జగిత్యాలలోని ఎస్సీ, ఎస్టీ మహిళ వెల్ఫేర్ హాస్టల్‌లో షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై మాట్లాడుతూ ఎవరైన మహిళలను వేధిస్తే షీటీం పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్ 8712670783 లేదా డయల్ 100 కు కాల్ చేయాలని తెలిపారు. మహిళ కానిస్టేబుల్స్ సౌజన్య, పూజిత పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయుడు ఫసియోద్దీన్ మాట్లాడుతూ హిందీ విశ్వ భాషగా మారిందని, హిందీ భాష సేవ దేశ సేవగా మహాత్మాగాంధీ అభివర్ణించారని చెప్పారు. విద్యార్థులకు కథలు, క్విజ్ పోటీలు, కవితలు, పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అంబటి లక్ష్మీరాజం, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో మంచిర్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ మోతిలాల్ కుటుంబసమేతంగా పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కా ర్యక్రమంలో ఆలయ ఈవో, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, మహిళలు డప్పు చప్పళ్ల, మేళతాళాల మధ్య గణనాథుడిని ఊరేగింపుగా తీసుకువెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం లక్ష్మీగణపతిస్వామి మహాపూజ ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఉదయం మ హాగణపతి మూలమంత్ర హవనము, ప్రధాన ఆలయం లో కొలువై ఉన్న మూల విరాట్టు లక్ష్మీ గణపతిస్వామివారికి రాత్రి మహాపూజ చేశారు.